అలా మాట్లాడటం తప్పే..
3 రోజులు ఉపవాస దీక్ష చేపడతా..
బీజేపీ పూరీ అభ్యర్థి సంబిత్ పాత్ర

భువనేశ్వర్, మే 21: పూరీ జగన్నాథుడు మోదీ భక్తుడంటూ నోరు జారడంపై బీజేపీ పూరీ అభ్యర్థి సంబిత్ పాత్ర పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. ఆయన వ్యాఖ్యలపై విమర్శలు రావడంతో దిద్దుబాటు చర్యలకు దిగారు. 'నోరు జారాను. క్షమాపణలు కోరుతున్నా. ప్రాయశ్చిత్తంగా మూడు రోజులపాటు ఉపవాస దీక్ష చేపడుతున్నా' అని మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. ఒడిశాలో మోదీ ఎన్నికల ర్యాలీ సందర్భంగా సంబిత్ పాత్ర చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. సీఎం నవీన్ పట్నాయక్, వివిధ రాష్ట్రాల సీఎంలు ఆయన వ్యాఖ్యల్ని ఖండించారు.

సంబిత్

ఢిల్లీలో ఢీ అంటే ఢీ

- గత రెండు ఎన్నికల్లోనూ బీజేపీ క్లీన్‌స్వీప్
- ఏడుకు ఏడు సీట్లూ కమలం పార్టీ కైవసం
- ఈసారి ఆప్ – కాంగ్రెస్ పొత్తుతో గట్టి పోటీ
- ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఐక్యతపై బీజేపీకి గుబులు
- 'కేజ్రీవాల్ అరెస్టు' సానుభూతిపైనా బెంగ

న్యూఢిల్లీ, మే 21: దేశ రాజధాని ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఆరో విడతలో భాగంగా మే 25న ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. గత రెండు ఎన్నికల్లోనూ ఈ ఏడు స్థానాల్లో త్రిముఖ పోటీ ఉండగా ఈసారి మాత్రం ఆమ్ ఆద్మీ పార్టీ – కాంగ్రెస్ కలిసికట్టుగా బీజేపీని ఎదుర్కొంటున్నాయి. 2014, 2019 ఎన్నికల్లో ఏడుకు ఏడు సీట్లు కైవసం చేసుకున్న బీజేపీ మరోసారి అవే ఫలితాలను రిపీట్ చేయాలని పట్టుదలగా ఉంది. మరోవైపు రాజధానిలోనే బీజేపీ దూకుడుకు బ్రేకులు వేయాలని, మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలని ఆప్ – కాంగ్రెస్ కూడా గట్టిగానే ప్రయత్నిస్తున్నాయి. మరో ఏడాదిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ లోక్‌సభ ఎన్నికలు బీజేపీకి, ఇండియా కూటమికి మరింత ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఢిల్లీ ఫలితాలు దేశ ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తాయి. ఢిల్లీలో 2004లో ఆరు స్థానాలను, 2009 ఏడు స్థానాలను కాంగ్రెస్ గెలవగా కేంద్రంలో యూపీఏ అధికారంలోకి వచ్చింది. 2014, 2019లో బీజేపీ క్లీన్‌స్వీప్ చేయగా కేంద్రంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. దీంతో ఢిల్లీవాసులు ఇచ్చే తీర్పుపై రాజకీయ విశ్లేషకుల్లోనూ ఆసక్తి నెలకొన్నది.

కొత్త ముఖాలతో బరిలో బీజేపీ

గత రెండు ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం ఏడు స్థానాలను బీజేపీ సులువుగా కైవసం చేసుకుంది. అయితే, ఈ ఎన్నికల్లో మాత్రం బీజేపీకి ఆప్ – కాంగ్రెస్ కూటమి నుంచి గట్టి పోటీనే ఎదురవుతున్నది. ముఖ్యంగా పదేండ్లుగా ఉన్న ప్రభుత్వంపై సహజంగా ప్రజల్లో ఉండే వ్యతిరేకత ఈసారి ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈశాన్య ఢిల్లీ నుంచి పోటీ చేస్తున్న మనోజ్ తివారి మినహా మిగతా ఆరుగురు సిట్టింగ్‌లను మార్చి కొత్త వారికి టికెట్లు ఇచ్చింది. అయితే, వీరిలో సుష్మా స్వరాజ్ కూతురు బన్సూరి స్వరాజ్ సహా ఎక్కువ మంది కొత్త ముఖాలే కావడం ఆ పార్టీకి కొంత నష్టం చేసే అవకాశం ఉంది. కేజ్రీవాల్ సహా, ఆ పార్టీ కీలక నేతలను జైలుకు పంపడం ద్వారా ఆప్‌పై అవినీతి ముద్ర వేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. అలాగే మలివాల్‌పై దాడి అంశాన్ని కూడా ప్రచారాస్త్రంగా మలుచుకుంది. ఇక, సీఏఏ అమలు, ఆర్టికల్ 370 రద్దు, రామమందిర నిర్మాణాలే ప్రధాన అంశాలుగా బీజేపీ ప్రచారం నిర్వహిస్తున్నది. బూత్ స్థాయి నుంచి బలమైన క్యాడర్ ఉండటం బీజేపీకి కలిసొచ్చే అవకాశం ఉన్నది.

ఈసారి ద్విముఖ పోరు

2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో బీజేపీ, కాంగ్రెస్, ఆప్ మధ్య త్రిముఖ పోటీ జరిగింది. 2014లో త్రిముఖ పోటీతో బీజేపీ చాలా లాభపడింది. ఈసారి మాత్రం బీజేపీని కలిసికట్టుగా ఎదుర్కోవాలని, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వొద్దని ఆప్, కాంగ్రెస్ భావించాయి. నాలుగు స్థానాల్లో ఆప్, మూడు స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తున్నాయి. దీంతో ఏడు స్థానాల్లోనూ బీజేపీకి ఈసారి గట్టి పోటీ ఎదురవుతున్నది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు, మైనారిటీ ఓట్లు, కాంగ్రెస్ సంప్రదాయ ఓటు బ్యాంకు, ఆప్ ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ఉన్న సానుకూల ఓట్లు కలిస్తే బీజేపీని ఓడించడం కష్టమేమీ కాదని ఇండియా కూటమి లెక్కలు వేసుకుంటున్నది. అయితే, రెండు పార్టీల పొత్తును వ్యతిరేకిస్తూ ఏకంగా పీసీసీ చీఫ్‌గా ఉన్న అర్విందర్ సింగ్ లవ్లీ సహా పలువురు కాంగ్రెస్ నేతలు పార్టీకి దూరమయ్యారు. ఇరు పార్టీల క్యాడర్ సైతం పూర్తిస్థాయిలో కలిసికట్టుగా పని చేయడం లేదు.

కాంగ్రెస్‌లో అసంతృప్తి సెగలు

ఎన్నికల వేళ ఢిల్లీ నెలకొన్న కాంగ్రెస్‌లో తీవ్ర అసంతృప్తి ఆ పార్టీకి నష్టం చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా టికెట్ల కేటాయింపుపై పార్టీ నేతల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. పొత్తులో భాగంగా ఆప్‌కి నాలుగు స్థానాలు విడిచిపెట్టడాన్ని కొందరు నేతలు వ్యతిరేకించారు. ఇంకొందరు పార్టీని వీడారు. ఇక, ఈశాన్య ఢిల్లీ అభ్యర్థిగా కన్హయ్య కుమార్‌కు టికెట్ కేటాయించడంపైనా అసంతృప్తి ఉంది. ఆయనను స్థానికేతరుడిగా కాంగ్రెస్ క్యాడరే భావిస్తున్నది. గత ఎన్నికల్లో కన్హయ్య తన స్వస్థలమైన బీహార్‌లో పోటీ చేసి ఓడారు. జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయనపై వచ్చిన ఆరోపణలు ఈశాన్య ఢిల్లీలోనే కాకుండా మొత్తం ఏడు స్థానాల్లోనూ బీజేపీకి ప్రచారాస్త్రాలుగా మారాయి. ఇక, వాయువ్య ఢిల్లీ నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఉదిత్ రాజ్ అభ్యర్థిత్వంపై కూడా క్యాడర్‌లో వ్యతిరేకత ఉంది.

సానుభూతి పవనాలు వీస్తాయా ?

ఆప్ పట్ల ఢిల్లీ ప్రజలు విలక్షణ వైఖరిని కనబరుస్తూ వస్తున్నారు. పార్లమెంటులో ఆ పార్టీని పక్కనపెడుతున్న ఓటర్లు.. వెంటనే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం బ్రహ్మరథం పడుతున్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌కు 32.90 శాతం ఓట్లే వచ్చాయి. ఒక్క సీటు కూడా ఆ పార్టీ గెలవలేదు. ఏడాది లోపే 2015 ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఆప్‌కు 54.3 శాతం ఓట్లు, 70 అసెంబ్లీ స్థానాలకు గానూ 67 స్థానాలు దక్కాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్ కేవలం 18.11 శాతం ఓట్లు సాధించింది. ఒక్క సీటూ దక్కలేదు. ఏడాదిలో వచ్చిన 2020 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఆప్ 53.57 శాతం ఓట్లతో 62 అసెంబ్లీ స్థానాలను దక్కించుకుంది. అయితే, ఈసారి పరిస్థితి భిన్నంగా ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కేజ్రీవాల్ సహా ఆప్ నేతలను జైలుకు పంపించడాన్ని బీజేపీ చేస్తున్న కక్షసాధింపు చర్యలుగా, ఆప్ లేకుండా చేసే ప్రయత్నంగా ఢిల్లీ ప్రజలు భావిస్తే మాత్రం ఈసారి ఆప్‌కు అనుకూలంగా సానుభూతి పవనాలు వీచే అవకాశం ఉందంటున్నారు.

లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్ భూషణ్‌పై
అభియోగాలు నమోదు

బ్రిజ్ భూషణ్

న్యూఢిల్లీ, మే 21: మహిళా రెజ్లర్ల ఆరోపణల నేపథ్యంలో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌పై మంగళవారం ఢిల్లీ కోర్టు లైంగిక వేధింపులు, బెదిరింపులు, మహిళల్ని కించపర్చడం తదితర అభియోగాలను నమోదుచేసింది. అయితే ఈ అభియోగాలను ఆయన తిరస్కరించారు. విచారణ జరపాలని కోర్టును అభ్యర్థించారు. 'నాపై వచ్చిన ఆరోపణల కారణంగా మా పార్టీకి మరిన్ని ఓట్లు పడతాయి' అంటూ వ్యాఖ్యానించారు. ఈ కేసులో సహ–నిందితుడు, మాజీ డబ్ల్యూఎఫ్ఐ అసిస్టెంట్ సెక్రటరీ వినోద్ తోమర్‌పైనా క్రిమినల్ అభియోగాన్ని కోర్టు నమోదుచేసింది. మహిళా రెజ్లర్లు చేసిన ఆరోపణలతో బ్రిజ్ భూషణ్‌పై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. ఉత్తరప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న బ్రిజ్ భూషణ్‌కు ఈసారి టికెట్ ఇవ్వడానికి బీజేపీ నిరాకరించింది. ఆయన కుమారుడు కరణ్‌భూషణ్ సింగ్‌ను ఎన్నికల బరిలో నిలిపింది.

అంబేద్కర్ లేకుంటే రిజర్వేషన్లకు
అంగీకరించేవారు కాదు
నెహ్రూపై మోదీ ఆరోపణ

మోతిహరి, మే 21: మాజీ ప్రధాని నెహ్రూతో సహా కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు అణగారిన కులాలకు రిజర్వేషన్లను వ్యతిరేకించారని ప్రధాని మోదీ ఆరోపించారు. బీఆర్ అంబేద్కర్ లేకుంటే.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లను నెహ్రూ అంగీకరించే వారు కాదని అన్నారు. రిజర్వేషన్ల అంశంపై నెహ్రూ ఆనాడు దేశంలోని రాష్ట్రాల సీఎంలకు రాసిన లేఖల్లో తన అభిప్రాయాలు స్పష్టంగా వ్యక్తం చేశారని మోదీ పేర్కొన్నారు. బీహార్‌లోని పుర్బి చంపారన్ లోక్‌సభ నియోజకవర్గంలో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. నెహ్రూ తర్వాత కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానులుగా చేసిన వాళ్లు, ఇందిరా గాంధీ లేదా రాజీవ్ గాంధీ.. ఎవరైనా రిజర్వేషన్లను వ్యతిరేకించిన వారేనని, అది ఆ పార్టీ లక్షణమని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కాంగ్రెస్ తగిన గౌరవం ఇవ్వలేదని మోదీ ఆరోపించారు. బీజేపీ అధిక మెజార్టీతో మూడోసారి అధికారంలోకి వస్తే, రిజర్వేషన్లను రద్దు చేస్తుందని విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అన్నారు.


అభిజిత్

మమతపై అనుచిత వ్యాఖ్యలు..
అభిజిత్‌పై ఈసీ నిషేధం

కోల్‌కతా, మే 21: పశ్చిమబెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తామ్‌లుక్ బీజేపీ అభ్యర్థి, కలకత్తా హైకోర్టు మాజీ జడ్జి అభిజిత్ గంగోపాధ్యాయ్‌పై ఎన్నికల సంఘం చర్యలు తీసుకొన్నది. ఆయన ఎన్నికల ప్రచారం చేయకుండా 24 గంటల నిషేధం విధిస్తూ మంగవారం నిర్ణయం తీసుకొన్నది. గంగోపాధ్యాయ్ వ్యాఖ్యలను 'తక్కువ స్థాయి వ్యక్తిగత దాడి'గా పేర్కొన్న ఈసీ.. ఆయన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని స్పష్టం చేసింది. అభిజిత్ గంగోపాధ్యాయ్ నిషేధం మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి అమలవుతుంది. ఈనెల 15న హల్దియాలో జరిగిన ఓ సభలో అభిజిత్ చేసిన అభ్యంతరకర ప్రసంగంపై టీఎంసీ ఫిర్యాదు మేరకు ఈసీ ఈ మేరకు చర్యలు తీసుకొన్నది.

'ఆర్టికల్ 370'పై పిటిషన్ల కొట్టివేత

న్యూఢిల్లీ, మే 21: ఆర్టికల్ 370కి సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. జమ్ము కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ 2019లో కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ 2023 డిసెంబరు 11న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సమీక్షించాలని జమ్ము కశ్మీర్‌కు చెందిన పలు రాజకీయ పార్టీలు, నేతలు, న్యాయవాదులు వేర్వేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం.. ఈ పిటిషన్లను కొట్టేసింది.

సిసోడియా బెయిల్ పిటిషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ, మే 21: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు న్యాయస్థానంలో మరోసారి ఎదురుదెబ్బ తగలింది. ఆయన బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు మంగళవారం తిరస్కరించింది. కేసు విచారణ కొనసాగుతున్న ఈ పరిస్థితుల్లో సిసోడియాకు బెయిల్ మంజూరు చేయడం సబబు కాదంటూ ఏప్రిల్ 30న ట్రయల్ కోర్టు తీర్పునిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ సిసోడియా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై మంగళవారం విచారణ జరిపిన కోర్టు.. బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

ప్రజ్వల్ దౌత్య పాస్‌పోర్టును
రద్దు చేయాలి
కేంద్రానికి కర్ణాటక లేఖ

బెంగళూరు, మే 21: కర్ణాటకలో సెక్స్ స్కాండల్ కేసును ఎదుర్కొంటున్న ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ దౌత్య పాస్‌పోర్ట్‌ను రద్దు చేయాలని కేంద్రానికి లేఖ రాసినట్టు రాష్ట్ర మంత్రి జీ పరమేశ్వర చెప్పారు. లైంగిక ఆరోపణల కేసులో ప్రజ్వల్ రేవణ్ణపై ఇప్పటికే న్యాయస్థానం అరెస్ట్ వారెంట్‌ను జారీ చేసిందని, ఈ క్రమంలో వెంటనే అతడి దౌత్య పాస్‌పోర్టును రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

బెంగాల్ గవర్నర్ వేధింపుల కేసు..
నలుగురు రాజ్‌భవన్ అధికారులకు సమన్లు

కోల్‌కతా, మే 21: బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ లైంగిక వేధింపుల కేసులో నలుగురు రాజ్‌భవన్ అధికారులకు పోలీసులు సమన్లు పంపారు. బాధిత మహిళ గవర్నర్ కార్యాలయం నుంచి ఏడ్చుకుంటూ వెళ్లడాన్ని ఈ నలుగురు అధికారులు చూశారన్నారు. అంతేకాకుండా ఆమెపై వేధింపులు వీరి సమక్షంలోనే జరిగాయని తెలిపారు. బాధితురాలి వాంగ్మూలంలోనూ ఈ నలుగురి పేర్లు ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. దీంతో ఈ కేసులో విచారణకు తమ ముందు హాజరు కావాలని ఈ నలుగురు అధికారులకు సమన్లు జారీ చేశారు.

తమిళులపై దుష్ప్రచారం మానుకోండి
రత్న భండార్ వ్యాఖ్యలపై మోదీకి స్టాలిన్ కౌంటర్

చెన్నై, మే 21: ఒడిశాలోని పూరి జగన్నాథ్ ఆలయ ఖజానా(రత్న భండార్) తాళంచెవిలు తమిళనాడుకు వెళ్లాయంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రంగా తప్పుపట్టారు. ఓట్ల కోసం తమిళనాడుపై, తమిళులపై దుష్ప్రచారం చేయడాన్ని మానుకోవాలని పేర్కొన్నారు. ప్రధాని తన ద్వేషపూరిత ప్రసంగాలతో రాష్ట్రాల మధ్య కోపాన్ని పెంచుతున్నారని ఆరోపించారు. ప్రధాని వ్యాఖ్యలు తమిళుల మనో భావాలను గాయపరిచేలా ఉన్నాయన్నారు.

జూన్ 28న ఇరాన్ అధ్యక్ష ఎన్నికలు

టెహ్రాన్, మే 21: అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ (63)మృతితో ఇరాన్ అంతటా విషాదఛాయలు అలుముకున్నాయి. ఇరాన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 5 రోజులపాటు సంతాపదినాల్ని ప్రకటించింది. మంగళవారం వివిధ నగరాల్లోని కూడళ్ల వద్దకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చి..ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నిజాయితీ గల విలువైన సేవకుడ్ని ఇరాన్ కోల్పోయిందని సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ అన్నారు. జూన్ 28న అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్నాయని ఇరాన్ అధికారిక మీడియా మంగళవారం తెలిపింది.

అమెరికాలో రోడ్డు ప్రమాదం..
ముగ్గురు భారత విద్యార్థులు మృతి

న్యూఢిల్లీ, మే 21: అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భారతీయ–అమెరికన్ విద్యార్థులు మరణించగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇటీవల అల్ఫారెట్టా నగరంలో వేగంగా వెళ్తున్న ఓ కారు బోల్తా పడింది. ఈ ఘటనలో మరణించిన వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. అందరూ 18 ఏండ్ల వయసు గల వారు కావడం గమనార్హం. మృతిచెందిన విద్యార్థులను శ్రియా అవసరాల, ఆర్యన్ జోషి, అన్వి శర్మలుగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో రిత్విక్ సోమేపల్లి, మహ్మద్ లియాకత్ గాయపడ్డారు. బాధిత విద్యార్థులు అల్ఫారెట్టా హైస్కూల్, యూనివర్సిటీ ఆఫ్ జార్జియాలో చదువుకొంటున్నారు. కారు ప్రమాదానికి అతివేగమే కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

చిత్రదుర్గ జిల్లాలోని ఓ దవాఖానలో సెల్‌ఫోన్ వెలుతురులో చికిత్స చేస్తున్న వైద్యుడు

కర్ణాటకలో కరెంట్ కోతలు

- ప్రభుత్వ దవాఖానలకూ సరఫరా కట్
- ఆరో గ్యారెంటీగా 'చీకటి భాగ్య'
- సిద్ధరామయ్య సర్కార్‌పై బీజేపీ ధ్వజం

చిత్రదుర్గ, మే 21: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో కరెంట్ కోతలు తీవ్రమయ్యాయి. విద్యుత్తు కోతలు సాధారణ ప్రజలపైనే కాకుండా దవాఖానలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చిత్రదుర్గ జిల్లా మొలకల్‌మురు తాలూకా పరిధిలోని ఓ ప్రభుత్వ దవాఖానలో కరెంట్ లేకపోవడంతో చీకట్లు కమ్ముకొన్నాయి. వైద్యులు సెల్‌ఫోన్ ఫ్లాష్‌లైట్ సాయంతో రోగులకు వైద్యం అందించాల్సిన దుస్థితి నెలకొన్నది. సెల్‌ఫోన్ లైట్ వెలుగులోనే సిబ్బంది రోగులకు మందులు ఇస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. గత వారం రోజులుగా ఆ ఏరియాలో విద్యుత్తు కోతలు నిత్యకృత్యంగా మారాయి. ఇందులో కీలకమైన దవాఖానలకు కూడా ఎలాంటి మినహాయింపు లేకుండా పోయింది. ఈ పరిస్థితిపై ప్రతిపక్ష బీజేపీ విమర్శనాస్త్రాలు సంధించింది. కాంగ్రెస్ సర్కార్ ఏడాది పూర్తి చేసుకొంటున్న సందర్భంగా హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు మరో 'గ్యారెంటీ'గా 'చీకటి భాగ్య' బహుమతిగా అందజేసిందని ఎద్దేవా చేసింది. దవాఖానలో చీకట్లకు సంబంధించిన వీడియోలను కూడా కర్ణాటక బీజేపీ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసింది. దవాఖానలకు కూడా విద్యుత్తు అందించలేని విపత్కర పరిస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం చేరిందని విమర్శించింది. ఖజానా ఖాళీ అయిందని, రాష్ట్రంలో తగినంత విద్యుత్తు సరఫరా లేదని పేర్కొన్నది.

యూరప్ పర్యటన మరింత భారం
షెన్‌జెన్ వీసా ఫీజు 12 శాతం పెంపు

న్యూఢిల్లీ, మే 21: ప్రపంచవ్యాప్తంగా షెన్‌జెన్ వీసా ఫీజును 12 శాతం పెంచాలన్న ప్రతిపాదనకు యూరోపియన్ కమిషన్ ఆమోదం తెలిపింది. స్లోవేనియా విదేశాంగ, యూరోపియన్ వ్యవహారాల శాఖ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. తాజా ప్రతిపాదన ప్రకారం జూన్ 11 నుంచి పెద్దల వీసా ఫీజు 80 యూరోల నుంచి 90 యూరోలకు, 6–12 ఏండ్లలోపు పిల్లల వీసా ఫీజు 40 నుంచి 45 యూరోలకు పెరగనుంది. ఈయూలో అక్రమంగా ఉంటూ తమ పౌరులను తిరిగి స్వదేశంలోకి అనుమతించని దేశాలకు చెందిన వారి వీసా రుసుమును 135 యూరోలకు పెంచింది. ఇది 180 యూరోలు కూడా చేరవచ్చు. ఈయూలో స్వల్ప కాలం బస చేసే వారికి షెన్‌జెన్(టైప్ సి) వీసా జారీ చేస్తారు.

కుదుపుల ధాటికి ఊడిపోయిన విమాన భాగాలు, చెల్లాచెదురైన వస్తువులు

విమానంలో భారీ కుదుపులు

- ఒకరి మృతి.. 30 మందికి గాయాలు
- లండన్ నుంచి సింగపూర్ వెళ్తున్న బోయింగ్ విమానంలో దుర్ఘటన
- బ్యాంకాక్‌లో అత్యవసర ల్యాండింగ్
- ప్రయాణికుల్లో ముగ్గురు ఇండియన్స్

బ్యాంకాక్, మే 21: లండన్ నుంచి సింగపూర్ వెళ్తున్న సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానం మార్గమధ్యంలో భారీ కుదుపులకు లోనైంది. ఈ ప్రమాదంలో బ్రిటన్‌కు చెందిన ఓ వృద్ధుడు మరణించగా, మరో 30 మంది గాయపడ్డారు. ఏడుగురు పరిస్థితి విషమంగా ఉన్నది. ప్రయాణికుల్లో ముగ్గురు భారతీయులు కూడా ఉన్నారు. విమానాన్ని బ్యాంకాక్‌కు మళ్లించి అత్యవసర ల్యాండింగ్ చేశారు. క్షతగాత్రులను దవాఖానలకు తరలించారు. 211 మంది ప్రయాణికులు, 18 మంది సిబ్బందితో మంగళవారం లండన్ నుంచి సింగపూర్ వెళ్తున్న బోయింగ్ 777–300ఈఆర్ విమానం మార్గమధ్యంలో హఠాత్తుగా 37 వేల అడుగుల నుంచి మూడు నిమిషాల వ్యవధిలోనే 31 వేల అడుగుల కిందకు దిగివచ్చింది. దీంతో విమానంలో తీవ్ర కుదుపులు చోటుచేసుకున్నాయి. ఒక వృద్ధుడు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. అతను గుండెపోటుతో మరణించి ఉంటారని భావిస్తున్నారు. బ్యాంకాక్‌లోని సువర్ణభూమి ఎయిర్‌పోర్టులో భారత కాలమాన ప్రకారం మధ్యాహ్నం 3.45 గంటలకు అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. మృతుని కుటుంబానికి సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంతాపం ప్రకటించింది. గాయపడ్డ వారికి తగిన చికిత్స అందజేస్తున్నామని తెలిపింది.

బ్రెయిన్ ఈటింగ్ అమీబాతో చిన్నారి మృతి
కేరళలో ఘటన.. కలుషిత నీరే కారణం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): కేరళకు చెందిన ఓ ఐదేండ్ల చిన్నారి 'బ్రెయిన్ ఈటింగ్ అమీబా'తో మృతి చెందింది. బాధిత బాలిక ఈ నెల 1న మళ్లీ 10వ తారీఖున స్థానికంగా ఉన్న చెరువులో స్నానానికి వెళ్లినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. కలుషితమైన ఆ నీటిలో ఉన్న ఫ్రీ లివింగ్ అమీబా ఆమె ముక్కుగుండా శరీరంలోకి వెళ్లి మెదడుపై తీవ్ర ప్రభావం చూపించినట్టు వైద్యులు గుర్తించారు. వ్యాధిని సకాలంలో కుటుంబసభ్యులు గుర్తించకపోవడం, వైద్య చికిత్స అందించడంలో అప్పటికే ఆలస్యం జరుగడంతో బాలిక మరణించినట్టు వెల్లడించారు.

ఏమిటీ బ్రెయిన్ ఈటింగ్ అమీబా?

పరాన్నజీవి కానటువంటి బ్యాక్టీరియా వర్గానికి చెందిన ఒక రకమైన అమీబాతో ఈ వ్యాధి వస్తుంది. కలుషితమైన నీటిలో జీవించే ఈ జీవి ముక్కు లేదా నోటిద్వారా శరీరంలోకి ప్రవేశించి మెదడును క్రమక్రమంగా పనిచేయకుండా చేస్తుంది. దీన్ని ఒకవిధంగా మెదడును తినేసే అమీబాగా పిలుస్తారు. ఈ వ్యాధి సోకినవారికి తొలుత తీవ్ర జ్వరం, తలనొప్పి, వాంతులు అవుతాయి. వెంటనే వైద్యసాయం అందించకపోతే బాధితుడు మరణించే ప్రమాదమున్నది. కేరళలో గతంలో 2017లో ఇకసారి, 2023లో మరోసారి ఈ కేసులు బయటపడ్డాయి. వైద్య భాషలో ఈ వ్యాధిని అమీబిక్ మెనింగో న్సిఫాలిటీస్‌గా పిలుస్తారు.

గుండె జబ్బులు ఉన్నవారికి యోగా రక్ష!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): గతంలో గుండెపోటు వచ్చిన వారు యోగా చేస్తే, గుండె సంబంధిత సమస్యలు తగ్గడంతో పాటు శారీరకంగా కూడా చురుగ్గా ఉంటారని ఐసీఎంఆర్–మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ శాస్త్రవేత్త డాక్టర్ అజిత్ సింగ్ తెలిపారు. యోగాభ్యాసంతో శ్వాస సమస్యలకు పరిష్కారం లభించడంతోపాటు మానసిక ప్రశాంతత, శారీరక విశ్రాంతి దొరుకుతుందని గుర్తు చేశారు. దీంతో ఒత్తిడి తగ్గి గుండె మెరుగ్గా పనిచేస్తుందని పేర్కొన్నారు.

సైక్లింగ్‌తో కీళ్ల వాతం దూరం!
మోకాళ్ల నొప్పులూ తక్కువే! • తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, మే 21: జీవితంలో ఏ దశలోనైనా సైక్లింగ్ చేసినవారికి మోకాళ్ల నొప్పులు 17 శాతం, కీళ్ల వాతం 21 శాతం తక్కువగా వచ్చే అవకాశాలున్నాయని తాజా అధ్యయనంలో తేలింది. 60 ఏండ్ల వయసు కలిగిన 2600 మందికి పైగా వ్యక్తులను ఈ అధ్యయనంలో పరిశీలించారు. ఈ అధ్యయనం వివరాలు మెడిసిన్ & సైన్స్ ఇన్ స్పోర్ట్స్ & ఎక్సర్‌సైజ్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ అధ్యయనంలో ప్రధాన పరిశోధకుడైన హ్యూస్టన్‌కు చెందిన డాక్టర్ గ్రేస్ లో మాట్లాడుతూ సైక్లింగ్ వల్ల మోకాళ్ల ఆరోగ్యం బాగుంటుందని.. కీళ్లకు జరిగే నష్టం కూడా తక్కువని తెలిపారు. ఎనిమిదేండ్ల పాటు జరిగిన ఈ అధ్యయనంలో పాల్గొన్నవారిని వారి జీవితంలో వివిధ దశల్లో తీరిక సమయంలో చేసిన వ్యాయామాల గురించి ఆరా తీశారు. 12–18 ఏండ్ల వయసు కలిగినప్పుడు సైక్లింగ్ చేసినవారిలో కండరాలు బలపడ్డాయని.. ఆ తర్వాత వారు సైక్లింగ్ మానేసినా కండరాల పటిష్ఠత కొనసాగిందని అధ్యయనంలో తేలింది. మోకాళ్ల చుట్టూ ఉండే కండరాలు సైక్లింగ్ వల్ల దృఢంగా మారతాయని, కీళ్ల జాయింట్ల కదలికలు కూడా మెరుగవుతాయని పరిశోధకులు వివరించారు. సైక్లింగ్ వల్ల శరీర బరువు అదుపులో ఉంచుకోవచ్చని... అదనపు బరువు వల్ల కీళ్లపై ఒత్తిడి పెరుగుతున్నదని తెలిపారు.

'సిక్స్‌ప్యాక్' కోసం.. ఆ సప్లిమెంట్స్ వద్దు!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): సిక్స్‌ప్యాక్ కోసం యువకులు జిమ్‌లలో కసరత్తులు చేస్తూ ఉంటారు. శరీరానికి ప్రొటీన్లు అందించడానికి, కండరాలు ఆకర్షణీయంగా కనిపించడానికి టెస్టోస్టిరాన్ సప్లిమెంట్లను తరుచూ వాడుతూ ఉంటారు. ఈ సప్లిమెంట్లు ఆరోగ్యానికి హాని చేస్తాయని పరిశోధకులు చెబుతున్నారు. రక్తపోటు పెరుగుతుందని, ధమనులపై ఒత్తిడి పెరిగి గుండె కొట్టుకోవడం ఆగిపోవచ్చని హెచ్చరిస్తున్నారు. ఈ వివరాలు 'సైన్స్ అలర్ట్'లో ప్రచురితమయ్యాయి.